

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు.
సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్

# జనస్వరం

REGD NO : APTEL 16144

పవర్

అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com





సంపుటి : 1 | సంచిక : 89 | ఎడిటర్ : నరేష్ సాకే | వార సంచిక : ( 10-04-2022 ) | పేజీలు : 5


## ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కోసం

# రూ.5 కోట్ల ఆర్థిక సహాయం

**జనస్వరం ( న్యూస్ ) :** జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం మంగళగిరి కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో అప్పుల బాధతో చనిపోయిన కౌలు రైతుల కుటుంబానికి 1 లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు. ఇందుకు గాను జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రూ.5 కోట్ల రూపాయల చెక్కును పార్టీకి అందించారు. ఆయన మాట్లాడుతూ నేను ఇచ్చే లక్ష రూపాయలు రైతుల కుటుంబాలకు ఏదో చేస్తుందని ఇవ్వడం లేదు. కనీసం వారి కోసం మనం ఉన్నాం, వారి కన్నీరు తుడుస్తాం అనే నమ్మకం ఇవ్వడానికే ప్రకటించానన్నారు. కౌలు రైతులలో అన్ని కులాల వారు ఉన్నారు. ఒక్క కులం వారు కాదు. అన్నం పెట్టే రైతులకు కులం ఉండదు. కానీ ysrcp పార్టీ రైతులకు కూడా కులాన్ని అంటగట్టింది. కౌలు రైతులు అంటే ఎవరూ అనే విషయం కూడా తెలియడం లేదు. వారిని పట్టించుకోకుండా వారి




ఆత్మహత్యలకు కారణం అయింది ysrcp పార్టీ ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు. బాదుడే బాదుడు అని ఆరోజు వైసీపీ నాయకులే చెప్పారు కదా. పాపం ప్రజల సమస్యలపై వేదన ఉంది అనుకుంటే, అధికారంలోకి వచ్చి చెత్త పన్ను, కరెంట్ బిల్లు ఇలా ప్రతీ విషయంలో రెట్లు పెంచుకుంటూ పోయింది ysrcp పార్టీ ప్రభుత్వం అని అన్నారు. మద్యపాన నిషేదం చేస్తామని అధికారంలోకి వచ్చి, ఇప్పుడు నాణ్యత లేని మద్యాన్ని ప్రత్యేక రేట్లకు అమ్ముతూ, రెట్లు పెంచడం వలన మద్యం తాగేవారు తగ్గుతారు అని ysrcp పార్టీనాయకులు తప్పుడు లాజిక్ చెప్తున్నారన్నారు. జనసైనికులపై ysrcp పార్టీ నాయకులకు అంత ప్రేమ అక్కర్లేదు. మీకు అంత ప్రేమ ఉంటే మొన్న మా సభకు వచ్చిన జనాలను తరువాతి రోజు పోలీసులను ఇళ్లకు పంపించి ఎందుకు బెదిరించారన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీల్చనివ్వను అని నేను ఎంతో ఆలోచించి అన్నాను. ysrcp పార్టీ నాయకులు రాష్ట్రాన్ని వల్ల పాలసీల ద్వారా శ్రీలంక లా మార్చేస్తుంటే వారి నుండి రాష్ట్రాన్ని రక్షించడానికి ఆ మాట అన్నానన్నారు. ఎంతోమంది మహానుభావులు త్యాగాలు చేస్తేనే స్వాతంత్య్రం వచ్చింది. అలాంటి వారిని గుర్తుచేసుకోవాలి. వారి స్ఫూర్తిని తీసుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు.


అక్రమానికి గురవుతున్న చెరువులను పరిశీలన 3

మానవత్వం చాటుకున్న గుడివాడ జనసైనికులు 4

మంచి నీటి సౌకర్యం వెంటనే కల్పించాలి 5

వేగుళ్ళ లీలా కృష్ణపై దుష్ప్రచారాలు మానుకోవాలి 6


## " అతివల చదువు - అవనికి వెలుగు "



- ఆలూరు నియోజకవర్గ విద్యార్థినులకు అండగా ఉంటాం అంటున్న జనసేన పార్టీ నాయకులు
- అతివల చదువు – అవనికి వెలుగు
- ఆంధ్రప్రదేశ్ లో అత్యధికంగా మధ్యలోనే చదువులు ఆగిపోతున్నాయి కనీస రహదారులు – బస్సు సౌకర్యాలు కల్పించలేని ప్రభుత్వాలు ఎందుకు?
- నిగ్గదీసి అడుగు ఈ వైయస్సార్ సీపి – తెలుగుదేశం పార్టీలను

**ఆలూరు, (జనస్వరం) :** కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తెర్నెకల్ వెంకప్ప గారి సూచనలు మేరకు దేవనకొండ మండల జనసేన నాయకులు 'అతివల చదువు – అవనికి వెలుగు' అనే నినాదామతో ఆడబిడ్డల చదువులకు అండగా ఉంటామంటూ, స్థానిక కస్తూర్బ బాలికల పాఠశాలలో ఆడబిడ చదువు యొక్క విశిష్టతను తెలిజేస్తూ, అలాగే వాళ్ళ చదువులకు అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు. అనంతరం MEO గారికి కూడా ఆడబిడ్డల రక్షణకు మీరు కూడా సహకరించాలని వారి తల్లిదండ్రులులోని భయందోళనలు పోగొట్టాలని వినవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మాయిలు చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయి.

మిగతా 6లో...

## ప్రభుత్వ నిధులు కాజేయడం ఏంటి ?

**- రాజోలు MPTC దార్ల కుమారి లక్ష్మి**



**రాజోలు ( జనస్వరం ) :** రాజోలు పంచాయతీ నుండి నిధులు మళ్ళించడాన్ని వ్యతిరేకిస్తూ తనని నమ్మి ఓట్లు వేసిన ఓటర్ల తరపున గళం వినిపించిన రాజోలు జనసేన mptc 1 దార్ల కుమారి లక్ష్మి. ఆమె పత్రికా ముఖంగా మాట్లాడుతూ ఉగాది కానుకగా జగన్ మోహన్ రెడ్డి రాజోలు పంచాయతికి కేటాయించిన 60 లక్షల రూపాయలు కాజేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పాపెట్టకుండా రాత్రికి రాత్రి తీసుకోవడాన్ని జనసేన పార్టీ తరపు నుండి మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. 15 వేల మంది జనాభా ఉన్న రాజోలు గ్రామంలో కనీసం డ్రైనేజ్ బాగు చేయించుకోలేని పరిస్థితి. ప్రజలు తీవ్రమైన అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. రోడ్లు నిర్మించుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాజోలు గ్రామాభివృద్ధికి కేంద్రం నుండి కేటాయించినా 60 లక్షల రూపాయలు తిరిగి వెంటనే పంచాయతీ ఖాతాలో జమ చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని జనసేన తరపున డిమాండ్ చేస్తున్నాం అన్నారు. లేనిపక్షంలో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని వినతి



**అనంతపురం ( జనస్వరం ) :** అనంతపురం మండలం, కందుకూరు గ్రామంలోని అంబేద్కర్ యువత ఆధ్వర్యంలో గ్రామ సచివాలయంలోని అధికారులని కలసి అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. యువ నాయకులు మాట్లాడుతూ యువత అంతా కలసి " అంబేద్కర్ యువత " గా ఒక సంఘముగా కలసికట్టుగా ఏర్పడ్డాము. ఈ సంఘము ఆధ్వర్యంలో గతంలో కందుకూరు గ్రామము నందు అనేక సేవా కార్యక్రమాలు చేసి ఉన్నాము. గ్రామ ప్రజలలో సామాజిక స్పృహ కలిగించేలా, వారిలో అభివృద్ధి చైతన్యాన్ని నింపేలా కార్యక్రమాలు చేశాము.

మిగతా 7లో...

ఎడిటోరియల్

# పాలన చేస్తోంది ప్రభుత్వమా ? పవన్ కళ్యాణా ??

ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలందరి బాగోగులు చూసుకునే బాధ్యత ఉంది. రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులు పరిరక్షించేలా, అందరికి సమాన అవకాశాలు కల్పిస్తూ, శాంతి భద్రతలు విఘాతం కలగకుండా చూసుకోవాలి. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక అప్పు తీసుకురావటం వాటిని వాళ్ళ వాళ్ళకి దోచి పెట్టడం తప్ప రాష్ట్రములోని పరిస్థితులను పట్టించుకునే స్థితిలో లేదు. రాష్ట్రములో ఎంతో మంది కౌలు రైతులు అనేక ఇబ్బందుల వల్ల అప్పులు తిరిగి చెల్లించలేని పరిస్థితులలో ఆత్మ హత్యలు చేసుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం రైతులకి భరోసా కల్పించే ప్రయత్నం కూడా చెయ్యట్లేదు.

రైతుల కష్టాలు అందరికి తెలిసినవే అయినా కూడా ఏ ప్రభుత్వంకూడా వాటిని పరిష్కరించే మార్గాన్ని చూడట్లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి ఇంకా దారుణంగా తయారయ్యింది. కొత్త కొత్త నిబంధనలు తెచ్చి కౌలు రైతుల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేస్తోంది. అలాగే 5 మందికే కార్డులు ఇస్తే చాలు అని టార్గెట్ పెట్టుకొని మిగితా వాళ్ళందరిని గాలికి వదిలేసింది. రైతు భరోసా కేంద్రాలు పెడుతున్నాం అని కాంట్రాక్టులు తీస్కోటంలో ఉన్న శ్రద్ద రైతులకు ఉపయోగపడటం లేదు. రైతు భరోసా కేంద్రాలు పెట్టి ఎంత మందికి విత్తనాలు సరఫరా చేసారు? ఎంతమందికి ఎరువులు అందించారు? మద్దతు ధర అందించటంలో కానీ, పంటను దాచుకోటానికి గోడౌన్ల విషయంలో కానీ రైతుకు ఎంత మేర సహాయం అందించారు. వైసీపీ ప్రభుత్వం రాగానే ఆంధ్రప్రదేశ్ మీద ప్రకృతి పగ పట్టింది. ఎప్పుడు చూసినా ఏవో ఒక తుఫాన్లు లేక వరదలు.





దీంతో రైతు చాల నష్ట పోయాడు. ఏ ఒక్క తుఫాన్ నష్ట పరిహారం అయినా పూర్తిగా అందరికి అందించారా? తిరిగి పెట్టుబడి పెట్టడానికి సహాయం చేసారా ? రాష్ట్ర ప్రభుత్వం దేనికి నడుస్తున్నట్టు. కేంద్ర ప్రభుత్వం డబ్బులు మాత్రమే ఇవ్వగలదు రాష్ట్ర ప్రభుత్వమే దగ్గరుండి రైతును కాపాడాలి. అది వదిలేసి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు ఇచ్చేసి మా పని అయిపోయింది అని చెప్తోంది రాష్ట్ర ప్రభుత్వం. ఇటువంటి బాధ్యతలేని ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో అనేక మంది కౌలు రైతులు ఆత్మ హత్యలు చేసుకున్నారు. వాటి మీద కూడా ప్రభుత్వం బాధ్యత వహించట్లేదు. వారికి రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా వాటిని కౌలు రైతుల ఆత్మ హత్యలు కాదని చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుకు 7 లక్షలు ఇస్తాం అని గొప్పగా చెప్పిన వైసీపీ పార్టీ ఏ ఒక్కరికి కూడా డబ్బులు పూర్తి గా ఇవ్వలేదు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం చెయ్యాల్సిన పనిని జనసేన పార్టీ తరపున పవన్ కళ్యాణ్ గారు చేస్తున్నారు. ప్రభుత్వం రైతు కుటుంబాల దగ్గరకు వెళ్ళి వాళ్ళకి భరోసా నింపి వారికి డబ్బులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పుడు జనసేన పార్టీ ఆ రైతు కుటుంబాలను పరామర్శించటానికి పూనుకుంది. అంతే కాకుండా తన సొంత డబ్బులు రైతులకి ఇచ్చి వాళ్ళలో భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఇది జనసేన పార్టీ చెయ్యాల్సిన పని కాదు. మనం అంతా ఎందుకు పన్నులు కడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా నడవాలని కదా? మరి రాష్ట్ర ప్రభుత్వం కాకుండా ఎందుకు జనసేన పార్టీ రైతు కుటుంబాలను ఆదుకోవాలి. మనం ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వం మన రైతు సోదరులను ఎందుకు ఇలా వదిలేసింది. అన్నం పెడుతున్న మన రైతు చనిపోతే కనీసం వాళ్ళని పరామర్శించే దిక్కు కూడా లేదా?

ప్రభుత్వం రైతులను కులాలుగా విడదీయ్యటంలో ఉన్న ఆంతర్యం ఏంటి. ఒక రైతు చనిపోతే ఆ అప్పులు కట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సహాయం చెయ్యదా? అంతే కాకుండా కేవలం కొంత మందికి మాత్రమే కార్డులు ఇస్తాం అంతే మిగితా రైతులు ఎందుకు పంటలు పండించాలి. వాటిని ప్రభుత్వానికి ఎందుకు అమ్మాలి. రైతులు అందరు పంటలు పండించాలి. వాటిని మీ దళారుల ద్వారా మీరు సొమ్ము చేసుకోవాలి. కానీ రైతుని మాత్రం ఆదుకోరు. వాళ్ళ కుటుంబానికి ఆపద వస్తే మాత్రం పట్టించుకోరు. ఎటువంటి ప్రభుత్వం ఈ రాష్ట్రంలో నడుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు 100 శాతం మందిని ఆదుకోలేదు. కానీ మరి దారుణంగా ఏ ఒక్కళ్లని ఆదుకోడానికి సిద్ధం గా లేదా? వేలల్లో కౌలు రైతులు మరణిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వ మౌనం దేనికి సంకేతం. క్రితం ప్రభుత్వంలో జరిగిన తప్పులు సరిదిద్దటానికి మిమ్మల్ని ఎన్నుకుంటే వాళ్ళు ఎం చేసారో మేము కూడా అదే చేస్తున్నాం అని చెప్తే ఇంకా మిమ్మల్ని ఎన్నుకున్నట్టు. అయితే మిమ్మల్ని ఎన్నుకోటంలోనే తప్పు జరిగింది. ఆ తప్పు సరి చెయ్యటానికే జనసేన పార్టీ ప్రభుత్వం చెయ్యాల్సిన పని చేస్తోంది. అంటే జనసేన మరో ప్రభుత్వాన్ని నడుపుతోందా? దానికి అవకాశం ఎవరిచ్చారు? మీ అసమర్ధత చేతకాని తనం కాదా?

రాష్ట్రంలో ఉన్న జనసైనికులు అందరు కూడా ప్రతి కలెక్టర్ దగ్గరకి వెళ్లి ఆత్మ హత్య చేసుకున్న రైతుల లిస్ట్ తో వాళ్లందరికీ నష్ట పరిహారం వచ్చే దాక పోరాడాలి. మనం పన్నులు కడుతోంది అందుకే. మన జేబులోంచి ఇవ్వటం కన్నా రాష్ట్ర ప్రభుత్వం చేత పని చేయించటం ముఖ్యం.

#Written By
ట్విట్టర్ : @vss_ramesh

# జనసేన పార్టీ ఎవరి పల్లకీలు మోయదు.. ప్రజలను పల్లకీల్లో కూర్చోబెట్టి మోస్తుంది

అమరావతి, (జనస్వరం) : 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని, రాని ప్రభుత్వం కోసం అధికారులు తపన పడొద్దని జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు వ్యాఖ్యానించారు. వైసీపీ సృష్టించిన అరాచకాలు, విధ్వంసానికి ప్రజలను ఓటు అడిగే హక్కు కోల్పోయిందని అన్నారు. ప్రజలను పల్లకీ ఎక్కించడానికి.. వారిని పల్లకీలో కూర్చోబెట్టడానికి జనసేన పార్టీ కృషి చేస్తుంది తప్ప ఎవరి పల్లకీలు మోయడానికి సిద్ధంగా లేదని అన్నారు. అనంతపురంలో ఈ నెల 12వ తేదీ నుంచి కౌలు రైతు కుటుంబాలను ఆదుకునే కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. మంగళవారం రాత్రి మంగళగిరి పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "చాలా మంది మేధావులు మీరు పార్టీ ఏలా నడుపుతారని అడుగుతున్నారు. మనకన్నా ముందు కాన్షీరాం గారి స్ఫూర్తితో చాలా పార్టీలు వచ్చాయి కానీ నిలబడలేకపోయారు. ఒక పార్టీ నిలబడాలి అంటే ఒత్తిళ్లను తట్టుకునే మానసిక స్థైర్యంతోపాటు అందరినీ ఏకం చేసే భావజాలం కావాలి. 8 ఏళ్లుగా పార్టీని నడపడం అంటే సామాన్య విషయం కాదు. మనస్ఫూర్తిగా మనల్ని మనం అభినందించుకోవాలి. ఈ ప్రయాణంలో తోడుగా ఉన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

**- చుక్క కన్నీరు తుడవ గలిగితే చాలు**

మనం ఈ రోజు ఒక ముద్ద తినగలుగుతున్నాం అంటే దానికి కారణం కౌలు రైతే. అలాంటి కౌలు రైతులు వేలల్లో ఆత్మహత్యలు చేసుకోవడం బాధకలిగించింది. కౌలు రైతుల సమస్య జనసేన సృష్టించింది కాదు. వాళ్ల ఆత్మహత్యలకు కారకులు వైసీపీ నాయకులే. కర్నూలు జిల్లాలో 353 మంది, అనంతపురంలో 178మంది, ఉభయ గోదావరి జిల్లాల్లో 81 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అందరూ కూడా వివిధ కులాలు, మతాలకు చెందిన వారు. 40 నుంచి 45 ఏళ్ల వయసు మధ్యవారు. అన్నం పెట్టే రైతులకు కులం లేదు. అలాంటి రైతులను కులంతో విభజించింది వైసీపీ పార్టీ. దగా పడ్డ రైతుకు అండగా నిలబడాలి. ఆత్మహత్యలకు పాల్పడ్డ కౌలు రైతులు వేలల్లో ఉన్నారు. వారందరి కుటుంబాలను ఆదుకోవడానికి అంత డబ్బు ఎక్కడ నుంచి తెస్తామని చాలా మంది అడుగుతున్నారు. మనసుంటే మార్గం ఉంటుంది. మనసును కదిలించ గలిగితే డబ్బులు అవే వస్తాయి. నేను పాటించనిదే ఎవరినీ ఏమీ అడగను. కష్టాల్లో ఉన్న వారికి మన వంతు సాయం చేయాలనే రూ. 5 కోట్లు ఇచ్చాను. మనం ఇచ్చే లక్ష రూపాయలతో కౌలు రైతుల కుటుంబాల్లో అద్భుతాలు జరిగిపోతాయని చెప్పను. వాళ్ల ఒక్క కన్నీరు చుక్కను తుడవగలిగితే మా జీవితం ధన్యమైనట్లేనని నమ్మతాను. దేశం కోసం సమాజం కోసం చాలా మంది మహానుభావులు వారి ఆస్తులను విరాళంగా ఇచ్చేశారు. నాకు వాళ్లంత పెద్ద హృదయం లేకపోవచ్చు కానీ నా స్థాయిలో నేను చేస్తాను.

ప్రకృతి విపత్తు నుంచి మొదలు కల్తీ విత్తు వరకు ముందు నష్టపోయేది రైతే. జనసేన చేపట్టిన రైతు భరోసా యాత్ర ఒక ఉద్యమంలా ముందుకు వెళ్లాలి. ఈ నెల 12న అనంతపురంలో మొదలుపెడతాం. కనీసం ఆ రోజు 30 మంది ఆత్మహత్యకు పాల్పడ్డ కౌలు రైతుల కుటుంబాలకు నష్ట పరిహారం అందిస్తాం.

**- రాష్ట్రాన్ని శ్రీలంకలా మార్చేశారు**

వైసీపీ వ్యతిరేక ఓటు చీల్చే ప్రసక్తే లేదని మార్చి 14న మాట్లాడటం వెనుక చాలా ఆలోచించే మాట్లాడాను. పాలనలో వైఫల్యం, అరాచకం, దోపిడి వల్ల రాష్ట్రాన్ని శ్రీలంకలా మార్చేశారు. ఇవన్ని దృష్టిలో పెట్టుకొనే ఆ రోజు ఆ మాట అన్నాను. 'వైసీపీ నాయకులు జనసైనికులారా మోసపోకండి.. వారి పల్లకీలు వీళ్ల పల్లకీలు మోయడానికి సిద్ధం కండి' అంటున్నారు. జనసేన ఉన్నది ప్రజల పల్లకీలను మోయడానికి తప్ప ఎవరి పల్లకీలను మోయడానికి కాదు. జనసైనికులకు నేనేంటో తెలుసు. వాళ్లపై మీకు నిజంగా ప్రేమ ఉంటే 14వ తేదీన సభకు వచ్చే వారిపై కేసులు ఎందుకు పెట్టారు? వైసీపీ వ్యతిరేక ఓట్లు చీల్చం అనే ఏకవాక్య తీర్మానానికి ఎందుకు అంత భయం? మీరు నిజంగా ప్రజలకు మేలు చేసే పాలనే అందిస్తే భయపడాల్సిన అవసరం ఏముంది? మద్యపాన నిషేధం అని ఓట్లు వేయించుకొని ఇప్పుడు ప్రత్యేక రేట్లతో అమ్ముతున్నారు. రేట్లు పెంచితే తాగుడు మానేస్తారని తప్పుడు లాజిక్ మాట్లాడుతున్నారు. విద్యుత్ ఛార్జీలపై బాదుడే బాదుడు అనే మాట మేము సృష్టించింది కాదు. 2018లో వైసీపీ నాయకత్వం ఉపయోగించిన మాటే. ఆస్తి పన్ను పెంచేస్తారు. చెత్తపన్ను విధిస్తారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వరు. 100 మంది దగ్గర ట్యాక్సులు వసూలు చేసి 30 మందికి సంక్షేమ పథకాలు అందిస్తే మిగతా 70 మంది ఏమవ్వాలి? 32 మంది బలిదానాలు చేస్తే స్టీల్ ప్లాంటు ఏర్పడింది. పార్లమెంటులో ఇంత మంది ఎంపీలు ఉన్నారు. ఒక్కరు కూడా కర్మాగారానికి సొంత గనులు ఇవ్వండి అని అడగలేకపోయారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను జనసేన పార్టీ వ్యతిరేకిస్తోంది. కార్మికుల పక్షాన నిలబడుతుంది. ఇదే విషయాన్ని కేంద్రానికి గౌరవ స్ఫూర్తిగా తెలియజేస్తాం. ప్రైవేటీకరణపై కేంద్రం మనసు మార్చుకుంటుందని నమ్మకముంది. సొంత గనులు ఇస్తుందని నమ్ముతున్నాను. ఒకవేళ ప్రైవేటీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే మాత్రం దానినెలా కాపాడుకోవాలో అందరితో కూర్చొని ఆలోచన చేసి ప్రణాళికతో ముందుకెళ్తాం.

బలమైన పాలన వ్యవస్థ ఉంటే క్రైమ్ చేసే వాడు భయపడతాడు. అలాంటి పాలన లోపించింది. శాంతిభద్రతల విషయంలో మనం 6వ స్థానంలో ఉన్నాం. ఇలాంటి పరిస్థితుల్లో నేరాలను అరికట్టే బలమైన పోలీసింగ్ వ్యవస్థ రావాలి. పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గించాలని కేంద్రాన్ని కోరుతాము. పొత్తులో ఉన్నామని ఒక మాట చెప్పడానికి భయపడాల్సిన అవసరం లేదు. నాపై ఉన్న కేసులు తీసేయండి అని అడగటం లేదు కదా? అలాంటి పరిస్థితులు ఉంటే రాజకీయాల్లోకి వచ్చే వాడినే కాదు. పొత్తులో ఉన్న రెండు పార్టీలు 70 శాతం ఏకాభిప్రాయం ఉంటే చాలు. అన్నింటినీ ఏకీభవించాల్సిన అవసరం లేదు.

# కౌలు రైతులకు 2 లక్షల రూపాయలు విరాళం

**- జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి పోలసపల్లి సరోజ**



**కాకినాడ, (జనస్వరం) :** జనసేనపార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆశయానికి తోడుగా రైతులకు అండగా కాకినాడ ప్రథమ మేయర్, జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి పోలసపల్లి సరోజ రైతులను ఆదుకునే విధంగా తన వంతు బాధ్యతగా జనసేనపార్టీకి 2 లక్షల రూపాయలను మంగళవారం నాడు మంగళగిరి పార్టీ ఆఫీస్ నందు పార్టీ అధ్యక్షులు వారు ఎదుట ప్రకటించిన విషయం విధితమే. ఆ విషయమై జనసేనపార్టీ అకౌంట్ ద్వారా పార్టీకి అందజేయడం జరిగింది. మన పార్టీ అధినేత చేపట్టిన ఈ బృహత్కార్యంలో మేముసైతం ప్రథమంగా భాగస్వామ్యం అవ్వడం చాలా ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. అధినేత చేసిన, చేస్తున్న విరాళాలు మమ్మల్ని ఎప్పటికప్పుడు ప్రభావితం చేస్తూనే ఉంటాయి, మరింత స్ఫూర్తిని కలుగజేస్తూ ఉంటాయని అన్నం పెట్టే రైతన్న ను ఆదుకోవాలి అని సంకల్పించిన పవన్ అన్నకు తోడుగా ఉండే క్రమంలో అవకాశం ఉన్న ప్రతీవారు భాగస్వామ్యం కావాలని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు.

# వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జనసైనికులు




కడప ( జనస్వరం ) : జిల్లాలో కౌలు రైతులకు సాగుదారు హక్కు కార్డు కల్పించాలని స్థానిక ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తూ రాజంపేట, ఒంటిమిట్ట, బాకరాపేట, కమలాపురం, బద్వేలు జాతీయ రహదారులపై ఫ్లెక్సీలు పెట్టడం జరిగింది. ఈ విధంగా రైతులను ఆదుకుంటూ, గ్రామాల్లోకి పార్టీని తీసుకుపోవడం ఇది మంచి పరిణామం అని జనసేన నాయకులు అన్నారు. ఈ ఆలోచన కమలాపురం జనసేన నాయకులు వేణుగోపాల్ రెడ్డి రావడం, దానిని రాజంపేట, బద్వేలు నియోజకవర్గ నాయకులు హరిరాయల్, బసవి రమేష్ తో పంచుకోవడం మంచి శుభపరిణామం అని తెలిపారు. ఈ ఫ్లెక్సీల ను దగ్గర వుండి సిద్ధవటం మండల నాయకులు కొట్టే రాజేష్ ఆధ్వర్యంలో రహదారుల పై ఏర్పాటు చేశారు. చూస్తున్న ప్రజలు ఈ కార్యక్రమం మంచిదని మా కౌలు రైతులకు ఈ జనసేన పార్టీ ఆలోచించడం సంతోషంగా వుందని ఆ నియోజకవర్గ ప్రజలు, రైతులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఇలాంటి ఆలోచన తీసుకుని వచ్చిన కమలాపురం జనసేన నాయకులు వేణుగోపాల్ రెడ్డి గారికి కడపజిల్లాలోని జనసైనికులు, నాయకులు అభినందనలు తెలియజేస్తున్నారు.

# అక్రమణకు గురవుతున్న చెరువులను పరిశీలన

**గుంటూరు, (జనస్వరం) :** గుంటూరు జిల్లా క్రోసూరు చెరువులో విచ్చలవిడిగా అధికార పార్టీ నాయకులు మట్టి తవ్వకాలు జరగడంతో ఆ త్రవ్వకాలను గుంటూరు జిల్లా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన షాడో సర్పంచ్, షేక్ మస్తాన్ అనే వ్యక్తి, అక్రమ తవ్వకాలతో కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారని, అదేమని అడిగితే అడిగిన వారిపై అక్రమ కేసులతో వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఒక ట్రక్కుకు, 200 రూపాయలు, లారీకి వెయ్యి రూపాయల లోడింగ్ కి చొప్పున వేలాది ట్రక్కులు, వేలాది లారీలు మట్టి తరలించారని, ఇలా వందలాది లారీలతో చెరువులు తవ్వి సొమ్ము చేసుకుంటున్నారని వైసిపి నాయకులపై మండిపడ్డారు. ఇకనైనా అక్రమ తవ్వకాలు మానుకోకపోతే రెండు రోజుల తర్వాత జనసేన పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. జనసేన పార్టీ తరపున, సమస్యలపై పోరాటానికి మేము సిద్ధంగా ఉన్నామని, దానికి జనం సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆడప మాణిక్యరావు, జనసేన పార్టీ



గుంటూరు జిల్లా కమిటీ కార్యదర్శి నక్క వంశీకృష్ణ, గుంటూరు జిల్లా జనసేన పార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి రామకృష్ణ, గుంటూరు జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు శాఖమూరి శ్రీనివాస్, గుంటూరు జిల్లా లీగల్ కమిటీ సంయుక్త కార్యదర్శి బయ్యవరకు నరసింహారావు, అచ్చంపేట మండలం జనసేన పార్టీ అధ్యక్షులు మట్టం వీరభద్రరావు, సత్తెనపల్లి నియోజకవర్గం సిరిగిరి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిరసన

ఆచంట ( జనస్వరం ) : ఆచంట నియోజకవర్గం వల్లూరులో పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని జనసేన ఆధ్వర్యంలో భారతరత్న డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చుని నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ జిల్లా సెక్రెటరీ చిట్టూరి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచి పేదవాళ్లపై పెనుభారం మోపుతుందని, ఇప్పటికే కరోనా విపత్తువలన అన్ని వర్గాల ప్రజల ఆదాయాలపై పెనుభారం పడిందన్నారు. జగన్ రెడ్డి గారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలన్నీ ఆకాశానికి అంటాయని, ఇప్పుడు మరలా విద్యుత్ చార్జీలు పెంచితే పేదవారు జీవించేది ఎలా అని ప్రశ్నించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసిన పాపానికి రాష్ట్ర



ప్రజలు ఇంట్లో ఫ్యాన్ వేసుకోవాలంటేనే భయపడేలా చేస్తున్నారని, కాబట్టి జగన్ రెడ్డి గారి ప్రభుత్వం వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు భారతరత్న డా బి ఆర్ అంబేద్కర్ గారి విగ్రహాలు వద్ద భారతరత్న డా బి ఆర్ అంబేద్కర్ గారి సాక్షిగా జనసేనపార్టీ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలియచేశామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కడిమి శ్రీనివాస్ గారు పాల్గొన్నారు.

## నారీస్వరం

# రైతాంగానికి సాయం ఏది ??

'ఆంధ్ర ప్రదేశ్ ' - భారత దేశ ధాన్య కర్మాగారంగా, అన్నపూర్ణ పేరు గాంచిన రాష్ట్రం. వ్యవసాయమే ఉపాధిగా కొన్ని వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్న నేల. ఎన్నో జీవనదులు పొంగి పొరలి ఏడాదికి మూడు పంటలు సైతం ఇచ్చే సారవంతమైన నేల ఈ రాష్ట్రానికి సొంతం. వ్యవసాయం అంటే రైతు. కానీ రైతులందరూ వ్యవసాయం సొంత భూమిలోనే వ్యవసాయం చేయరు ఆంధ్రప్రదేశ్లో దాదాపు 35.7% కౌలు రైతులు ఉన్నారు. జనాభాలో సగానికి పైగా జీవనోపాధికి ప్రధాన వనరు వ్యవసాయం కోవిడ్-19 వ్యాప్తి తర్వాత ఆర్థిక పరిణామాల వల్ల వ్యవసాయ సంక్షోభంలో పడింది ఇవి కాక కరువు, వరదల వల్ల రైతులు, ముఖ్యంగా కౌలు రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

ఒక అధ్యయనం ప్రకారం ప్రతి ఏడు వ్యవసాయ కుటుంబాలలో ఒకరు కౌలుదారులు ఉన్నారు మొత్తం వ్యవసాయ కుటుంబాలలో దాదాపు 13.65% ఉన్నారు. 2015-2016లో నిర్వహించిన నాబార్డ్ ఆల్ ఇండియా రూరల్ ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ సర్వే (NAFIS) అధ్యయనం ప్రకారం, దాదాపు 52% వ్యవసాయ కుటుంబాలు సగటున రూ. 1 లక్ష కోట్లు రుణ ఉచ్చులో ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ వరి, మొక్కజొన్న, రొయ్యల - ఆక్వాలో భారీ ఉత్పత్తిని కలిగి ఉన్న వ్యవసాయ రాష్ట్రం. ఆంధ్ర ప్రదేశ్ సామాజిక - ఆర్థిక సర్వే ప్రకారం ఇందులో 69.27% మంది రైతులు కనీసం రెండు ఎకరాలు కూడా లేని రైతులు ఉండగా.19.31% సగటు అయిదు ఎకరాల పైన భూమిని కలిగి ఉన్నారు.ఆర్థిక ఇబ్బందుల వల్ల రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు కూడా తీవ్ర స్థాయిలోనే ఉన్నాయి. ఇది 2018లో 664 నుండి 2019 నాటికి 1029కి పెరిగింది.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం యొక్క "నవ రత్నాలు" సంక్షేమ పథకాలలో ఒకటైన రైతు భరోసా, చిన్న & సన్నకారు రైతులు (5 ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్నవారు), కౌలుదారులను లబ్ధిదారులుగా చేర్చారు. వీరిలో ఎక్కువ మంది BC, SC & ST వర్గాలకు చెందినవారు. రూ. 13,500 రైతులకు అందిస్తుండగా, అందులో చిన్న రైతులకు 6000 /- రూపాయలు ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద కేంద్రం భరిస్తుంది. కౌలు రైతుల విషయానికొస్తే, మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే పంపిణీ చేస్తుంది. 2019-2020 సంవత్సరానికి సంబంధించి మూడు విడతల చెల్లింపులు విడుదలయ్యాయి.ఇందులో 46,69,375 మంది రైతులు 1,58,123 మంది కౌలు రైతులు ఉన్నారు. కౌలు రైతులు ఒక్కొక్కరు సగటున దాదాపు రూ.2 లక్షల అప్పులతో తీవ్రంగా అప్పులపాలయ్యారని తేలింది. కొన్ని పంటల్లో ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.1.2 లక్షల వరకు, కోస్తా జిల్లాల్లో 32 బస్తాల వరకు వరి సాగు భారం మోపుతున్నారు.

సిసిఆర్సి కార్డ్ను స్వీకరించడానికి అతిపెద్ద అడ్డంకి ఏమిటంటే, దరఖాస్తుపై సంతకం చేయడానికి యజమానులు నిరాకరించడం మరియు వారిని ఒప్పించడంలో అధికారుల వైఫల్యం. 90 శాతానికి పైగా కౌలు రైతులు గత మూడేళ్లలో కనీసం ఒక్కసారైనా తీవ్రంగా పంట నష్టపోతే కానీ ఒక్క శాతం మాత్రమే ఏదైనా విపత్తు పరిహారం పొందారు. ఇదే కౌలు రైతులను అప్పుల ఊబిలోకి నెట్టడంలో పెద్ద పాత్ర పోషించింది. ఇది ఇలా ఉంటే ప్రభుత్వ తీరుతో తీవ్ర నిరాశకు గురైన కౌలు రైతు కుటుంబాలకు జనసేన ఊపిరి పోసింది అనే చెప్పాలి. కౌలు రైతుల కష్టాలను ప్రభుత్వం పెడ చెవిన పెట్టింది. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన ప్రభుత్వ తీరు కౌలు రైతులకు అనుగుణంగా లేకపోవడంతో అప్పులభారం నుండి బయటికి రాలేక మరణించిన 80 కౌలు రైతుల కుటుంబాలకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గారు ప్రతి కుటుంబానికి లక్షచొప్పున ఆర్థిక సాయం ప్రకటించడమే కాకుండా రాష్ట్రంలోని మొత్తం కౌలు రైతులకు అండగా ఐదు కోట్ల సహాయనిధిని విడుదల చేయడం అభినందించదగిన విషయం. ఇంతటితో ఆగకుండా రైతుల తరఫున పోరాడటానికి జనసేన నడుం బిగించడంతో నిరాశ నిండిన కౌలు రైతుల కుటుంబాలకు ఊరట లభిస్తుంది.ప్రభుత్వం ఒంటి పోకడ నిర్ణయాలు మార్చుకొని , కౌలు రైతుల కష్టాలను పరిగణలోకి తీసుకోవాలని ఆశిద్దాం.

అన్నదాత సుఖీభవ !! - టీం నారీస్వరం

# తెర చాటున మానవత్వాన్ని చాటుతున్న గౌండర్ రమ్య

కలలు అందరూ కంటారు... కానీ, ఆ కలల కోసం నిత్యం శ్రమించేది కొందరే ఉంటారు. తమ కలల స్వాప్నికను సొంతం చేసుకునే క్రమంలో సమాజానికి తమ వంతుగా బాధ్యతగా సేవ, ఉన్నంతలో ఇతరులకు సహాయంగా నిలుస్తూ, అందరికి ఆదర్శంగా నిలుస్తూ తాము మాత్రం తెర వెనుక మౌనంగా ఉండిపోతుంటారు. అలాంటి కోవకు చెందినవారే గౌండర్ రమ్య మురుగేష్.

రమ్య పుట్టింది, పెరిగింది మాత్రం ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా కుప్పంలో. తల్లి మంజుల, తండ్రి మురుగేశ్ తమిళం అయినా తెలుగు ప్రాంతం మీద మమకారం ఎక్కువ. తాతయ్య వాళ్ళు కుప్పంలో స్థిరపడ్డారు. ఇక రమ్య కూడా తన బాల్యాన్ని, చదువును కుప్పంలోనే పూర్తి చేసుకుంది. తాను పుట్టింది మధ్యతరగతి కుటుంబ నేపథ్యం అయినా సమాజానికి సేవ చేయాలి, తాను కలలు కన్న ఫిల్మ్ డైరెక్టర్ అవ్వాలని నిత్యం పరితపించేది. చిన్నప్పటి నుంచే చందమామ కథలు, హిస్టారికల్ కథలు చదవడం అలవాటు చేసుకుంది. చిన్నతనం నుండే కవితలు రాయడం, వినిపించడం చేసేది. అలా స్వతహాగా తమ చుట్టూ ఉన్న స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆ కవితల్ని మెచ్చుకునేవారు. తను రాసే కథలతో ఇతరుల్ని ఆకట్టుకునేలా మెప్పించేది. అలా సినిమా డైరెక్టర్ కావాలన్న తపన మరింత తనలో పెరిగింది. 4 భాషలలలో అనర్గళంగా మాట్లాడడం, రాయడం వచ్చు. Lyricist, గిటార్ కూడా అద్భుతంగా వాయిస్తారు. జంతువుల వాయిస్ ను మిమిక్రీ చేయగలుగుతారు. ఇలా అన్నీ రకాల కళాపోషణలను కలగూరగంపలా తనలో నిక్షిప్తం చేసుకున్నారు. కార్పోరేట్ ఉద్యోగం చేస్తూ 70 వేల రూపాయలు సంపాదిస్తూ, 5 వేల రూపాయల జీతం తీసుకునే అసిస్టెంట్ డైరెక్టర్ గా ఎందుకు వెళ్లాల్సి వచ్చింది ? కరోనా విపత్కర సమయంలో సమాజ సేవ చేస్తూ ప్రజల మన్నలను ఏ విధంగా పొందారో తెలుసుకుందాం.

### చదువు & ఉద్యోగం :

చిన్నతనం నుండే చదువు మీద ఆసక్తి ఎక్కువగా ఉండేది. కుప్పం ద్రవిడియన్ యూనివర్సిటీలో BBM, బెంగళూరులో జైన్ కాలేజ్ లో MBA పూర్తి చేసుకున్నారు. కంప్యూటర్ కోర్సు HDCA, SAP Course చేసుకొని ఒక సంవత్సరం Genesys private limited company లో ఉద్యోగం చేసి, ఆ తర్వాత 2 సంవత్సరాలు Wipro కంపెనీలో టీమ్ లీడర్ గా పని చేస్తూ నెలకు బాగానే సంపాదించేవారు. అయినా ఏదో వెలితిగా అనిపించేది. తాను కలలు కన్న ఫిల్మ్ డైరెక్టర్ కావాలన్నది తన లక్ష్యం. ఆ దిశగా అనిత గారి సపోర్టతో అసిస్టెంట్ డైరెక్టర్ గా కెరీర్ మొదలు పెట్టారు . ఈ క్రమంలోనే యూట్యూబ్ కు షార్ట్ స్టోరీస్, షార్ట్ ఫిల్మ్స్ కు కథలు అందించడం, రాప్ సాంగ్స్ రాయడం చేస్తూ ఉండేది. చిన్నతనం నుండే కవితలు రాయడం, షార్ట్ స్టోరీస్ రాయడం వలన ఒక 500 కవితల్ని ఒక " సామెతలు – 2021 " పుస్తకంగా తీసుకొచ్చారు. ఈ పుస్తకం చాలా మందిని మెప్పించింది. తన కలను నిజం చేసుకోవడానికి పూలపాన్పు లాంటి తన ఉద్యోగాన్ని వదిలి, కష్టాల కడలిగా అడుగు వేసింది చిత్ర పరిశ్రమలోకి.



### చిత్ర పరిశ్రమ :

ఉద్యోగం వదిలేసి, చిత్ర పరిశ్రమలోకి అడుగు పెడుతానంటే తన చుట్టూ ఉన్న స్నేహితులు, బంధువులు ఎవరూ అంగీకరించరు. అందునా అమ్మాయి అంటే అసలు ఎవరూ ఒప్పుకోరు. ఇలాంటి సందర్భాలే రమ్యకు ఎదురయ్యాయి. అయినా తాను ఎక్కడా వెనుకడుగు వేయలేదు. బంధువుల నుంచి, స్నేహితుల నుంచి గౌండర్ రమ్య అవమానాలు, ఈసడింపులు భరించారు. కానీ రమ్య వాళ్ళ అమ్మ మాత్రం తనను ప్రోత్సహించింది, భరోసా ఇచ్చింది, ధైర్యాన్ని ఇచ్చింది. వాళ్ళ అమ్మ ఇచ్చిన ఆత్మ విశ్వాసంతో అడుగులు ముందుకేసింది. చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టగానే పూలపాన్పు పరచి ఉండదు. తనకు తెలుసు కష్టాలు ఉంటాయని, వాటిని స్థైర్యంతో ఎదుర్కొని తన లక్ష్యాన్ని దరి చేరాలన్న ఆత్మవిశ్వాసంతో 5 వేల రూపాయలతో అసిస్టెంట్ డైరెక్టర్ గా చేరింది. తన మాటలతో, వ్యాక్చాతుర్యంతో, కథలు చెప్పే విధానం, అన్నింటికీ మించి తన నిజాయితీతో అందర్నీ అనతి కాలంలోనే అందర్నీ ఆకట్టుకుంది. చిన్న వయసులోనే కథలు చెప్పే విధానాన్ని చూసి తనకు మరిన్ని అవకాశాలు ఇచ్చారు. అలా 3 సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేసి, ప్రస్తుతం తానే స్వంతంగా ఒక సినిమాకు డైరెక్టర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అనిత గారు వెన్ను తట్టి ప్రోత్సహించడం వల్ల ఈరోజు చిత్రపరిశ్రమలో కొంత మేర నిలదొక్కుకున్నాని చెప్పారు. అమ్మ రోల్ మోడల్ అని చెప్తూ ఉంటారు. తనకు వెట్రిమరన్, బాల, రాజమౌళి, సుకుమార్, ప్రశాంత్ నీల్ డైరెక్షన్స్ అంటే ఇష్టమని చెప్పారు. చిత్ర పరిశ్రమకి వచ్చిన తొలినాళ్ళ నుండి తనకి మెళుకువలు, సలహాలు, సూచనలు ద్వరకిరాగవ గారు అందించేవారని, అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించారని చెప్పారు.

### సేవా కార్యక్రమాలు :

నాణేనికి రెండు వైపులా ఉన్నట్లు, రమ్య కూడా ఒకవైపు సినిమా మేకింగ్ పనులు చేస్తూనే, మరో వైపు సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉన్నారు. కరోనా విపత్కర సమయంలో ప్రపంచం అంతా నిశ్శబ్ధత వహించినా, తాను మాత్రం బయటకు వచ్చి కరోనా బాధితులకు సేవలు అందించింది. కరోనాతో మరణించిన కొందరి అభాగ్యులను కన్న వారే పట్టించుకోని తరుణంలో రమ్య గారే ముందుకు వచ్చి దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ కరోనా సమయంలో తన వంతుగా ప్లాస్మా కూడా డొనేట్ చేశారు. ఇప్పటిదాకా 15 సార్లు రక్తదానం చేశారు. కరోనా బాధితులకి తమ ఇంటి వద్దకే వెళ్ళి నాణ్యమైన ఆహారాన్ని అందించారు. కరోనా పేషంట్లను తన స్వంత వెహికల్ తో ఆసుపత్రికి తీసుకెళ్ళడం, ఇంటి వద్దకు డ్రాప్ చేయడం తన టీం సభ్యులతో కలసి చేశారు. కరోనా విపత్కర సమయంలో యాచకులకు, వీధి జంతువులకు ఆహారం లేకుండా అల్లాడిపోయినా హృదయ విశాదకర దృశ్యాలు చూశాం. అలాంటి సందర్భంలో ఆహారాన్ని రోడ్డు పక్కన ఉన్న యాచకులకు అందించారు. అనాధ ఆశ్రమాలు తగిన నిత్యావసర సరుకులు లేక అల్లాడుతుంటే వారి పరిస్థితిని తెలుసుకొని స్పాన్సర్స్ ద్వారా వారికి నిత్యావసర సరుకులు అందించడం చేశారు. Blood, oxygen, ventilator, food, plasma etc.. ఇలా ఎవరికి అవసరం వచ్చినా తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా సహాకారం అందించి, చాలామంది ప్రాణాలను కాపాడారు. కరోనా సమయంలో 24 గంటలు కరోనా బాధితులకు సహాయం చేసే పనుల్లోనే నిమగ్నమయ్యేవారు. భవిష్యత్తులో ఒక స్వచ్ఛంధ సంస్థ నిర్వహించి తద్వారా అనేక మందికి సేవలు అందించాలని కోరుకుంటున్నారు. అనేక సంస్థల నుంచి ప్రశంసా పత్రాలు, కరోనా వారియర్స్ గా గుర్తిస్తూ దాదాపుగా 80 సర్టిఫికేట్స్ అందుకున్నారు. సంగీత అనే పేద బాడీబిల్డర్ కు తన వంతుగా ఆర్థిక సహకారం అందించి, తనని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లెలా ప్రోత్సహిస్తున్నారు. భవిష్యత్తులో మంచి పేరున్న డైరెక్టర్ గా ఎదగాలని, తాను అనుకున్న స్వచ్ఛంధ సంస్థ ఏర్పాటు చేసి ఇంకా ఎక్కువ మందికి సేవలు అందించాలని జనస్వరం న్యూస్ ద్వారా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.



# పెంచిన ఆర్టీసీ చార్జీలు వెంటనే తగ్గించాలి

తిరుపతి ( జనస్వరం ) : పెంచిన ఆర్టీసీ చార్జీలు వెంటనే తగ్గించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నియోజకవర్గ హెడ్ కోటర్స్ చంద్రగిరి టవర్ క్లాక్ దగ్గర జిల్లా కార్యదర్శి దేవర మనోహర ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దేవర మనోహర మాట్లాడుతూ ప్రజలపై బాదుడికి బ్రాండ్ అంబాసిడర్ మరియు 31 కేసులు ఉన్న సీబీఐ దత్తపుత్రుడు, చెత్త పై కూడా పన్ను వేసి చెత్త పుత్రుడు అప్పెక్కడ పుడుతుంద నని వెతికే అప్పు పుత్రుడు జగన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి సామాన్యులపై పెనుభారం మోపుతొందన్నారు. పెంచిన ఛార్జీలు తగ్గించుకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ గారికి, ఎమ్మార్వో మరియు ఎంపీడీవో గారికి సమర్పించారు.

రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిని గారు మాట్లాడుతూ ఎడ్లబండి దశనుంచి మెట్రో వరకు ఆధునిక దిశగా అడుగులు వేస్తున్న మనల్ని తిగిరి మళ్లీ అదే ఎడ్లబండి దశకు తీసుకెళ్తున్న వైసిపి ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ తక్షణమే ప్రభుత్వం స్పందించి పెంచిన ధరను తగ్గించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఇదే విధంగా కొనసాగితే వైసీపీ ప్రభుత్వాన్ని ఓఎల్ఎక్స్ లో పెట్టుకోవాల్సి వస్తుంది అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంజీవి హరి, వినోద్ మరియు మండల నాయకులు మురళి, వేణు, ధరణి, ఐతేపల్లి సాయి, జనసేన సాయి, యువరాజ్, ఆశ, కిరణ్, శేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




## పాఠకులకు మనవి

జనస్వరం ఈ - వార్తాపత్రిక (వార సంచిక) నందు మీ గళమైన వాణిని వినిపించాలనుకుంటున్నారా? మీ నియోజకవర్గ ప్రాంతంలో జరిగిన సంఘటనలను మన వార్తాపత్రిక నందు పంచుకోవాలనుకుంటున్నారా? మీ సమస్యలను మా పత్రిక నందు విన్నవించుకోవాలని అనుకుంటున్నారా? మీ స్వరంతో ప్రజలకు మరింత చేరువ అవ్వాలంటే మాకు ఈ క్రింది వాటికి పంపించండి.

9642067900

janaswaramnews@gmail.com

జనస్వరం న్యూస్ వెబ్సైట్ మరియు వార్తాపత్రిక మరింత నాణ్యమైన వార్తాప్రపంచాన్ని మీ ముందుకు తీసుకురావడానికి మీ వంతు సహాయంగా ఆర్థికంగా చేదోడుగా నిలవాలని కోరుకుంటున్నాము.

Phonepe/Googlepay
9642067900

UPI id : janaswaram@ybl

